# నవ్వులాటకు

సమీరుడు నాకు బావమరదివరుస. అతడు చామనచాయ గల పొట్టి మనిషి. అయితే స్ఫురద్రూపి. మాకు చిరపరిచితుడు. అందుచే మా కాంతంతో చనువుగా మాట్లాడుతాడు. అతడువచ్చి వీధిగదిలో కూర్చున్నాడని నాకు లోపలికి కబురువచ్చింది.

నేనూ స్నానంచేసి ధౌతవస్త్రము ధరించి కేశ సంస్కారము చేసుకొని వచ్చినాను. ఇద్దరం చెరియొకకుర్చీలో కూర్చున్నాము. సమీరుడికి ఒక సిగరెట్టు యిచ్చి నేనూ ఒకటి వెలిగించినాను. అతను అన్నాడు,

“అయితే నామీద నీకు దయ తప్పినట్లుంది?”

“ఎందుకు అల్లా అంటున్నావు? అల్లా జరుగుతుందా? మన స్నేహం. ఆచంద్రతారార్కం అల్లాఉండాలిసిందే!”

“ప్రతి సంవత్సరాదిని మనము అంతా కలసి కొంతకాలము హాయిగ గడుపుదామని అనుకొన్నాము. మొన్న మొన్నటి వరకు అల్లాగే జరిగింది. కాని మొన్న పోయిన సంవత్సరాదికి నీవు నన్ను ఆహ్వానించకపోవటం నాకు చాలా మనస్తాపం కలిగించినది. నన్నెందుకు పిలువలేదు?”

“కొంచెము నిదానించు. చెపుతాను. తెలుసుగా మీ చెల్లెలు కాంతం విషయమై!”

“మాచెల్లెలు కాంతం విషయమై పూర్తిగా తెలుసు. ఏవిషయంలోను ఏమి అంటానికీ ఆస్పదం లేదు. ఆమె దొడ్డ

ఇష్టాలు. నాయందు ఆమెకు మిక్కిలి దయ. ఆమె నాకు ఉద్యోగము ఇప్పిస్తే అది తప్పదనికాని ఆమెకు నాయందు దురభిప్రాయము ఉండదనికాని అంటే నేనది విశ్వసించను.”

“శబాష్! ఆమెవిషయమై నీవు ఇట్టి అభిప్రాయాన్ని వెలిబుచ్చుటం నాకు నిజంగా మనోరంజకంగా ఉంది. నీకు ఆమెయందుండే అభిమానంకూడా మహా గొప్పది. అయితే నిజం చెప్పక తప్పదు కదా? నిన్ను పిలుచుటకు ఆమెకు ఇష్టం లేకపోవుటచేతనే ఇంతకాలానికి నిన్నుగాని పిలువలేదు.”

“నీమాటలు చాలా విచిత్రంగా ఉన్నవి. ఆమె ఇదివరలో నాయందు చూపిన ఆదరము, ప్రేమ అద్వితీయము. ఇట్లు నన్ను పిలువనట్టు అంటానికి కారణం యేమి? ఇట్టి భావ విన్నానికి కారణం యేమో నాకు చెప్పాలి.”

“చెప్తాను. మన రాముడు మీకు తెలుసునుకదూ?”

“రాముడా - ఎవరువాడు?”

“మారాముడిని ఎరుగవా? మానౌకరు రాముడు.”

“వాడా!—అవును. వాడిని ఎరుగకేమి? ఎరుగుదును. వాడు చాలా మంచివాడు సుమీ!”

“అల్లాగే వాడిని సేవాపరాయణత్వములో హనుమంతుడితో పోల్చవలె. ప్రతి పని కూడా బహుచక్కగా చేస్తాడు. నాబూడ్సుజోడుకు రంగు వేశాడా అంటే అవి నల్లగా జీడిగింజల వలె నిగనిగలాడుతూ ఉంటవి. వాడు బట్టలు ఉతికినాడా అంటే అవి మల్లెపువ్వులవలె తెల్లగా నుంటవి. నేను తాగే

మందు ఎక్కడినుంచి తేవలెనో, ఎంత మోతాదు ఇయ్యవలెనో మెలకువలన్నీ తెలుసు."

"అల్లాగా? అయితే అది చాలాగొప్పవిషయం."

"అంతేకాదు. వాడు ఎటువంటివా డనుకొన్నావు? బంగారము బజారులో కనుపించినా అసహ్యమైన వస్తువులాగ చూస్తాడు. పిల్లలను వాడిచేతికిచ్చి షికారుపంపితే జాగ్రత్తగా కాపాడుతాడు. పైకం యిచ్చి సంతకు పంపినా, బజారుకు పంపినా బహునేర్పుగా బేరంచేసి సరకులు తేవటమే కాక ఒకపైసా అయినా తన స్వంతానికి వాడుకోడు."

"అల్లాగా? నౌకరులలో అంత మంచివాడు ఉండటం అరుదు సుమీ!"

"నీకూ ఆమాటే తోచిందీ? అయితే వాడికిఒకదుర్గుణం ఉంది. అదేమిటో తెలుసునా, సౌందర్యపిపాస. ఇదొక్కటే వాడికున్న కళంకం."

"దానికేమిలే! అదొక పెద్దనీచగుణంగా ఎంచనక్కరలేదు. వయసుతనంలో అది క్షమార్హణీయము. వయసుకు వలపు. చింతకు పులుపు సహజము. సౌందర్యపిపాసా పీడితుడు వాడు. ప్రేమైకజీవి. అదీకాక నిష్కళంకమైన శీలముగల దేవుడెవడు? చంద్రుడికి కళంకం లేదా? భగవానుడు అనే అఖండ తేజోమూర్తి అయిన శూరుని గర్భంలో మచ్చలున్నవి. దాని విషయమై నీవు విచారించవలసిన పనిలేదు. కాని నేను అడిగిన విషయమేమిటి? నీవు చెప్పే సంగతియేమిటి!"

"సఖీరామా! నీవు నిజంగా సహృదయుడవు. కాబట్టి విన తగినమాట అన్నావు. ఆ ఒక్క కళంకం ఉందని అతనిని పని లోనుంచి తీసివేయటం న్యాయమా?

"ఛీ–ధర్మము కాదు."

"అట్టివాడు ఏదో తప్పుచేస్తే నాభార్య, వానిని పనిలో నుంచి తొలగించమంటే, వాడిపక్షంవహించి ఏదో విధంగా వాడిని రక్షించటం నాకు ధర్మము అంటావా"

"ధర్మాలలోకల్లా అది ఉత్తమ ధర్మము. అట్టి నౌకరు ఉంటే, నేను వాడి పక్షం వహించి అబద్ధాలైనా ఆడి వాడిని కాపాడుతాను. కానీ ఏమి టీ గొడవ! నాప్రశ్నకు జవాబు చెప్పకుండా ఏవో అల్లిబొల్లి కబుర్లు చెప్పి నన్ను మోసపుచ్చా లని చూస్తూ వున్నావు!"

"కాదు, కాదు, విను. నిన్నుచూస్తే నాకు నీయందు గౌర వమూ, అభిమానమూ ఎక్కువ అవుతున్నది. నిజంగా నీహృద యము కరుణార్ద్రము. వాడి సేవాప్రియత్వము, మొద లైన సుగుణాలు నీవు స్వయంగా చూశావు కాబట్టి నీకు వాడిమీద అంత అభిమాన మనుకొంటా."

"ఎప్పుడు చూశాను?"

"రాముడిని నీవు తిరుణాలకు మంగళగిరి తీసుకొని పోయినావు.'

"అవునవును, జ్ఞాపకం వచ్చింది. అపుడు నాకు వాడు చాలా సేవ చేసినాడు. వాడేదో పిచ్చిపని చేస్తే వాడిని నేను వెనుక వేసుకొని పోట్లాడినాను."

"పిచ్చిపని యేముందీ ? వడ్రింగి సోమయ్యభార్యని చూచి సౌందర్యపిపాసాబాధితుడై ఏదో అన్నాడట."

"అవును జ్ఞాపకమే. కాని ఏమిటీ గొడవ?"

"తరువాత మాకాంతంతో ఆవిషయము అంతా ఎవరో చెప్పి, వాడు చేసే వన్నీ ఇట్టిపనులే, ఫలాని వారి నౌకరు ఇటువంటి పనులు చేస్తున్నాడంటే మీకే అప్రదిష్ట. వాడిని మీయింట్లో నుంచి వెళ్ళగొట్టండి అన్నారట. వాడిని తీసివేయ మని కాంతం పట్టుబట్టి నన్ను వేధించటం మొదలు పెట్టింది. అప్పుడేమి చెయ్యాలె."

"మీరు ఇంట్లోనుంచి వెళ్ళగొట్టడం అవివేకం. అట్టి మంచి నౌకరు దొరకటం దుర్లభం, ఏదో ఒక దుర్గుణం ఉన్నా సహించి ఊరుకోవాలె."

"మనం మొగాళ్ళం సహిస్తాము. ఆడవాళ్ళు ఇటువంటి విషయాలలో బొత్తుగా సహనం చూపరు."

"అయితే ఒకటి చేయకపోయినావా ? మాచెల్లెలు కాంతం చాలా మంచిమనిషి. ఏమిచెప్పినా నమ్ముతుంది. ఏదో మాట చెప్పి ఆవిషయం సర్దక పోయినావా ?"

"అబద్ధం ఆడవచ్చు నంటావా?"

"సందేహం ఏమిటి. అటువంటి విషయాల్లో కాకపోతే ఇంకెప్పుడు అబద్ధం ఆడటం."

"భేష్, మంచిమాట అన్నావోయి. ఈమాటే కల కాలం ఉండాలె. వెధవ నౌకరును రక్షించటానికి వాడిని వెనక

వేసుకొని అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యతో అబద్ధాలు చెప్తారా? అంట్లా వనుకొన్నాను. అయితే అప్పుడేమి చేశానను కొన్నావు. అబద్ధం ఆడాను.”

“మంచిపని చేశావు. కాని నన్ను పండుగకు పిలువవద్దని కాంతం అన్నానికి ఆమెకు నాపై కోపం ఎందుకువచ్చిందో ఇంతవరకూ చెప్పకుండా నన్ను మరిపించాలని చూస్తున్నావు.”

“వేదోయి, ఆపాయింటికే వస్తున్నా. అప్పుడేమి అబద్ధం ఆడినానో విన్నావా. సోమయ్యభార్యను దుర్భాషలాడింది రాముడు కాదనిన్నీ. వాడితో వెళ్ళిన నీవే ఆపని చేశావని చెప్పి ఆమె నమ్మకపోతే ఎన్నో అబద్ధాలాడి మాయపుచ్చి నమ్మించాను...... ......................అట్లా చూస్తా వెందుకు? ఇప్పుడే కదా అన్నావు, అట్టి సాకరును అబద్ధంఆడి అయినా ఆదరించాలని. అసలుకథ విను. అపుడు కాంతానికి రాముడిపై నున్న కోపం అంతా గిరుక్కున వెనక్కు తిరిగి నీమీద పడ్డది, అందుకని నిన్ను పండగకు పిలువవద్దు అన్నది.

తెల్లబారిన ముఖంతో “ఎంతపని చేశావోయి. కాంతంతో ఇపుడే నిజం అంతా చెపటానికి నేవెళ్ళుతున్నా. కథ అడ్డంగా తిరుగుతుంది చూసుకో.” అని సమీరుడు లోపలికి పోయినాడు. నేను ఆరిపోయిన సిగరెట్టును పారవేసి క్రొత్త సిగరెట్టును వెలిగించుకొని కుర్చీలో పడుకొన్నాను. తీరా వీడు నిజము అంతా చెప్పేస్తే ఆకోపం అంతా నామీద పడుతుందే మోరాబాబు. ఏమిటిగతీ. అని అనుకుంటూ దడదడ కొట్టు

కుంటూవున్న గుండెకు శాంతి కలుగజేయాలని ప్రయత్నం చేస్తూఉన్నాను. ఇంతలో 'ఏమండోయి' అని కాంతం పిలిచింది.

'ఆఁ'

'ఇల్లారండి.'

'ఎందుకు? పనిమీదఉన్నా.'

'ఏంపని? రావాలి' అన్నది. వెళ్ళక తప్పిందికాదు. ఏమైనా కానీమని మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ లోపలికి వెళ్ళాను.

## ఇంట్లో విరహం

నాటకానికి వెళ్ళి వచ్చాను. నాటకంలో నాయికానాయకులు ఒకరినొకరు ప్రేమించుకొంటారు. ఒకరినొకరు వదలిఉండలేరు.

ఆ తరువాత ఎడబాటు కలుగుతుంది. నాయిక విరహతాపం అనుభవిస్తుంది. ముత్యాల హారాలు తెంపి పోస్తుంది. తుమ్మెదలనూ, కోయిలలనూ తిడుతుంది. చంద్రదూషణ చేస్తుంది. వెన్నెల వేడి భరించలేక బాధపడుతుంది. తాపజ్వరంలో సొమ్మసిల్లి పోతుంది. మన్మధుడ్ని దూరుతుంది. దాసీలు పన్నీరుచల్లి మూర్ఛనుండి ఆమెను లేవనెత్తుతారు.

అటుతరువాత నాయకుడు రావటం అతన్ని అమాంతం తన కౌగిట్లో నలిపి వేయటం, ముద్దులు కురిపించటం జరుగుతుంది.